'సీతారామ'తో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

బీజీ కొత్తూరు పంపు హౌజ్ వద్ద గోదావరి జలాలను పరిశీలిస్తున్న తుమ్మల

అశ్వాపురం, మార్చి 3: సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారావు పేర్కొన్నారు. సోమవారం దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వలను ఆయన పరిశీలించారు. అనంతరం సీతారామ ప్రాజెక్టు బీజీ కొత్తూరు రాజీవ్‌కెనాల్‌ను నాగార్జున సాగర్ కెనాల్‌కు అనుసంధానం చేయడం ద్వారా గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. సాగర్ ఆయకట్టుకు మూడు పంప్ హౌజ్‌లతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. విభజన చట్టంలో ఉన్న నీటి వాటాను వాడుకోవడానికి కేంద్రం అడ్డుపడుతూ తెలంగాణ ప్రాంతం వైపు చిన్నచూపు చూస్తుందన్నారు. మారెళ్ళపాడు ప్రాజెక్టును పూర్తి చేసి అశ్వాపురం, బూర్గంపాడు, మణుగూరు మండలాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

ములకలపల్లి, మార్చి 3: సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగర్ ఆయకట్టుకు గోదావరి నీటిని కృష్ణా నీటితో కలిపి అందించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని సీతారామ పంప్‌హౌస్‌ను సందర్శించారు. కమలాపురంలోని హెడ్ రెగ్యులేటర్ వద్ద విలేకరులతో మాట్లాడారు. గోదావరి జలాలను కృష్ణా జలాలతో కలపడం బృహత్తర కార్యక్రమమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.8 వేల కోట్లతో మొదలైన ఈ ప్రాజెక్టు, వంద కిలోమీటర్ల పొడవు కాలువ నిర్మాణంతోపాటు మూడు పంప్ హౌస్‌లను పూర్తి చేసుకుని లక్ష ఎకరాలకు సాగు నీరు అందించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు తరలించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. సీతమ్మ సాగర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వాల్సుందని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే 359 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితోపాటు ఉమ్మడి జిల్లాలో రైతుల భూములకు నిర్విరామంగా సాగు నీరు అందించేందుకు వీలవుతుందని చెప్పారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సిగ్గుచేటు

మణుగూరు టౌన్, మార్చి 3: ఎస్ఎల్‌బీసీలో సెంటీమీటర్ సొరంగం తవ్వడం కూడా చేతకాని సీఎం 12 కిలోమీటర్ల టన్నెల్ పూర్తిచేసిన బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పేర్కొన్నారు. 13 నెలలుగా ప్రాజెక్టు పనులను పూర్తిగా పక్కనపెట్టి కావాలనే కేసీఆర్ ప్రభుత్వంపై నెట్టాలనే నీచానికి దిగడం అత్యంత దుర్మార్గమన్నారు. మొత్తం సొరంగం 43.94 కిలోమీటర్లైతే, 2005-2014 వరకు ఉన్న కాంగ్రెస్ సర్కార్ హయాంలో తవ్వింది కేవలం 22.89 కిలోమీటర్లే అని అన్నారు. సొరంగంలో క్లిష్టమైన పరిస్థితులున్నా ఏ ప్రమాదం జరుగకుండా ఏకంగా 12 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు పూర్తి చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కావాలనే బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

భద్రాచలం ఏఎస్‌పీ విక్రాంత్‌కుమార్ సింగ్

క్రీడాకారులతో ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్

దుమ్ముగూడెం, మార్చి 3: ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువత అన్ని రంగాల్లో ముందుండాలని భద్రాచలం ఏఎస్‌పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ అన్నారు. దుమ్ముగూడెం పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ములకపాడు క్రీడా మైదానంలో జరిగిన మండలస్థాయి వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దమ్ముగూడెం మండలంలోని యువత క్రీడల్లో జాతీయస్థాయి వరకు చేరుకొని ఈ ప్రాంతానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పోలీసు శాఖ తరపున ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్ల తెలిపారు. అనంతరం వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన కొత్త మారేడుబాక, రెండో బహుమతిని అంజిబాక టీంలకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం సీఐ రమేష్, ఎస్సైలు వెంకటప్పయ్య, గణేశ్ పాల్గొన్నారు.

హత్యకేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీంద్రారెడ్డి

మణుగూరు టౌన్, మార్చి 3: గత నెల 27వ తేదీన రాత్రి మణుగూరు దుర్గా ఓసీ కంపెనీలో మెకానికల్ హెల్పర్‌గా పని చేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన మునిప్రసాద్ విశ్వకర్మ క్యాంపు సమీపంలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై 28వ తేదీన దుర్గా కంపెనీ మేనేజర్ ముత్తుకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మణుగూరు సీఐ సతీష్‌కుమార్ దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం మణుగూరు డీఎస్పీ రవీంద్రారెడ్డి హత్య కేసు వివరాలను వెల్లడించారు. క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్‌లతో క్యాంపు చుట్టుపక్కల అనుమానితుల ఆధారాల కోసం వెతికారు. ఎస్సైలు ప్రసాద్, రంజిత్, ట్రైనీ ఎస్సై మనీషాతో మూడు బృందాలుగా ఏర్పడి చుట్టుపక్కల బెల్టు షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో మృతుడు తిరిగిన చోట్ల సీసీ కెమెరాలతో అనుమానితుల గురించి ఆరా తీశాము. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన ఈ కేసులో అనుమానితులుగా ఉన్న గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఫార్మర్ వినోద్‌సింగ్‌ను పూర్తి ఆధారాలతో విచారించగా అతడు హత్య చేసినట్లుగా ఒప్పుకున్నాడు. గత నెల 27వ తేదీన రాత్రి 7 గంటల సమయంలో డ్యూటీలు ముగించుకొని మణుగూరు ప్లవర్ మార్కెట్ ఏరియాలోని బెల్టు షాపులో మద్యం, ఫ్రైడ్ రైస్ తీసుకొని క్యాంపు దగ్గరలో ఉన్న కాలువలో మద్యం తాగుతుండగా ఇద్దరి మధ్యలో వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన వినోద్‌సింగ్ మద్యం మత్తులో మునిప్రసాద్ తలపై బలంగా మోదడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్సైలతో పాటు సిబ్బంది వీర, షమీం, రామారావును డీఎస్పీ అభినందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతతో నిర్మించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం అర్బన్, మార్చి 3: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నాణ్యంగా ఉండాలని, ఈ విషయంలో మేస్త్రీలదే కీలక పాత్ర అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. స్థానిక ప్రగతి మైదానంలోని నాక్ సెంటర్‌లో సోమవారం మేస్త్రీలకు శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పేదలకు తక్కువ ఖర్చుతో పటిష్టంగా ఇండ్లు నిర్మించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఇంటిని 400 చదరపు అడుగుల్లో, ప్రభుత్వ మిచ్చే రూ.5 లక్షలతో నిర్మించాలని చెప్పారు. నిధులు నాలుగు దశల్లో మంజూరవుతాయన్నారు. మొదటి విడతగా పునాది పూర్తయిన తర్వాత రూ.లక్ష, రెండవ విడతగా గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.1.25 లక్షలు, మూడో విడతగా స్లాబ్ పూర్తయిన తరువాత రూ.1.75 లక్షలు, నాలుగో విడతగా రూ.లక్ష ఇస్తామని వివరించారు. హౌసింగ్ పీడీ శంకర్, మెప్మా పీడీ రాజేష్, మ్యాక్ అధికారి హెప్సిబా పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్

కొత్తగూడెం టౌన్, మార్చి 3: ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోగల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తనిఖీ చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లు ఉన్న గదిని, సీసీ కెమేరాల గదిలోని కెమెరాల పనితీరును పరిశీలించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనుమతి లేనిదే ఎవరినీ లోపలికి అనుమతించరాదని చెప్పారు. ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయికృష్ణ పాల్గొన్నారు.

'ఎల్ఆర్ఎస్'ను వేగవంతం చేయండి

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయిలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పురోగతిపై అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, పంచాయతీ, నీటిపారుదల, టీపీవో, రెవెన్యూ శాఖ అధికారులతో సోమవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలన్నారు. పంచాయతీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. అశ్వారావుపేట మున్సిపాలిటీగా రూపాంతరం చెందినందున మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి కావాల్సిన లాగిన్‌లను త్వరితగతిన వచ్చేలా చూడాలన్నారు. అవసరమైన చోట అదనపు లాగిన్ల ద్వారా సమన్వయంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు

వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెంలో లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 3 : మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలపై అసంతృప్తి చెందిన ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందిన పార్టీ మిలీషియా, సీఎన్ఎం సభ్యులైన 14 మంది జిల్లా పోలీస్ అధికారులు, సీఆర్‌పీఎఫ్ 81వ, 141వ బెటాలియన్ అధికారుల ఎదుట లొంగిపోయినట్లు భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు తెలిపారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ 'చేయుత' కార్యక్రమానికి ఆకర్షితులవుతున్న మావోయిస్టు పార్టీ నాయకులు, సభ్యులు లొంగుబాటు బాట పడుతున్నారని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగలతోరుకు గ్రామానికి చెందిన మడివి భీమా(ఆర్‌పీసీ మిలీషియా కమాండర్), అదే గ్రామానికి చెందిన ఆర్‌పీసీ సీఎన్ఎం ఎర్రపల్లి అధ్యక్షులు సోడి ఉంగా, మడివి అడుమ, కుంజాం కోసా(ఆర్‌పీసీ డీఏకేఎం సభ్యుడు), కోవాసి నంద అలియాస్ శ్రీను(సీఎన్ఎం కమాండర్), మడివి భీమా(ఆర్‌పీసీ సీఎన్ఎం సభ్యుడు), మడివి మాసా(సీఎన్ఎం పూజారీ కాంకేర్ ఆర్‌పీసీ), బీజాపూర్ జిల్లా దొడ్డి తుమ్నార్ గ్రామానికి చెంది కుంజాం లక్మా(టైలరింగ్ టీమ్ కమాండర్, దక్షిణ బస్తర్ డివిజన్), ఉసుర్ పోలీస్‌స్టేషన్ పరిధి కస్తూరిపాడు గ్రామానికి చెందిన వెట్టి లక్కే(పూజారీ కాంకేర్ ఆర్‌పీసీ సీఎన్ఎం సభ్యురాలు), ఇదే గ్రామానికి చెందిన మడవి చుక్కయ్య(ఆర్‌పీసీ మిలీషియా క్యాడర్), వెట్టి కోసా(ఆర్‌పీసీ సీఎన్ఎం సభ్యుడు), మడివి భీమా అలియాస్ రంగ(ఆర్‌పీసీ సీఎన్ఎం సభ్యుడు), సోడి రాధిక అలియాస్ పాలే(ఆర్‌పీసీ మిలీషియా సభ్యురాలు), కుర్రామి కాజల్ అలియాస్ పాలే(ఆర్‌పీసీ సీఎన్ఎం సభ్యురాలు) లొంగిపోయిన వారిలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. పోలీస్ శాఖ ఏజెన్సీ ప్రాంతాల్లో చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలతోపాటు మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుల వేధింపులు, కాలం చెల్లిన సిద్ధాంతాలతో అలసిపోయి ఇటీవల కాలంలో 65 మంది మావోయిస్టు పార్టీకి చెందిన నాయకులు, సభ్యులు లొంగిపోయారని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఒక రాష్ట్ర కమిటీ సభ్యుడితోపాటు ఒక డివిజన్ కమిటీ సభ్యుడు, 17 మంది ఏరియా కమిటీ సభ్యులు లొంగిపోయిన వారిలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఓఎస్డీ పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్, మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి, చర్ల సీఐ ఆలెం రాజువర్మ, ఎస్సీ-2 ఇన్‌స్పెక్టర్ చెన్నూరి శ్రీనివాస్, కరకగూడెం ఎస్సై ఆలకుంట రాజేందర్, ఆర్ఐలు బోలెం రవి, లాల్‌బాబు, కృష్ణారావు, ఆర్ఎస్సై ఓంప్రకాశ్, పీఆర్‌వో దామలూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భార్య, బిడ్డతో లొంగిపోయిన హార్డ్ కోర్ మావోయిస్టు దినేష్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 3 : మావోయిస్టు పార్టీలో కీలకంగా పనిచేసిన హార్డ్ కోర్ మావోయిస్టు తన భార్య, బిడ్డతో కలిసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ పోలీసుల ఎదుట సోమవారం లొంగిపోయినట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా గంగలూరు ఏరియా కమిటీ కార్యదర్శి, హార్డ్ కోర్ మావోయిస్టు కమాండర్ దినేష్ 100కుపైగా సైనికుల హత్యకాండ ఘటనల్లో పాల్గొన్నాడు. అతడిపై అక్కడి ప్రభుత్వం ఇప్పటికే రూ.8 లక్షల రివార్డు సైతం ప్రకటించింది. దినేష్ బీజాపూర్ జిల్లా పెద్దకొర్మ గ్రామానికి చెందినవాడు. చిన్నతనంలోనే దినేష్‌ను తమ వెంట తీసుకెళ్లిన మావోయిస్టులు అతడికి ఆయుధాలు ఉపయోగించడం, ఆకస్మిక దాడులకు ఎలా పాల్పడాలి, ఐఈడీని నాటడం వంటి వాటిపై మెళకువలు నేర్పించారు. ఇందులో ఎన్నో ఏళ్ల అనుభవం పొందిన దినేష్ తన నైపుణ్యాన్ని వినియోగించి అనేక ఘాతుకాలకు పాల్పడ్డాడు. దీంతో మావోయిస్టు పార్టీ అతన్ని ఆ సంస్థ ఏరియా కమిటీ సభ్యుడిగా ప్రకటించింది. కొంత కాలానికి దినేష్ చురుకుదనాన్ని గమనించిన మావోయిస్టు అగ్ర నాయకులు అతడికి గంగలూరు ఏరియా కమిటీ కార్యదర్శి, డీవీసీఎం బాధ్యతలు అప్పగించారు. బీజాపూర్ జిల్లాలో జరిగిన అనేక మావోయిస్టు ఘటనల్లో దినేష్ కీలకపాత్ర పోషించాడు. మావోయిస్టుగా ఉన్నంత కాలం దినేష్ ఏకే-47, ఇన్‌సాస్, ఎస్ఎల్ఆర్ వంటి ఆయుధాలను వినియోగించాడు. అలాగే ఇతను హిడ్మా, దేవాతో కలిసి పని చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ 'కగార్' పేరుతో జరుగుతున్న వరుస ఘటనలతోపాటు పోలీసుల ఒత్తిడి పెరగడంతో దినేష్ తన భార్య, కుమార్తెతో వచ్చి లొంగిపోయినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసు అధికారులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ భాస్కర్ నాయక్

జూలూరుపాడు, మార్చి 3: ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. సమయ పాలన పాటించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో మధ్యాహ్న భోజనం బిల్లులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 3: మధ్యాహ్న భోజనం బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. ఆమె సోమవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఐడీవోసీ కార్యాలయం నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ట్రెజరీ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు ప్రక్రియ ఆలస్యం అవుతున్నందున నేరుగా ఆన్‌లైన్‌లోనే చెల్లించేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో భాగంగా వివిధ రకాల రిపోర్టులు ఉంటాయని అన్నారు. అవన్నీ ప్రస్తుత యాప్‌లో ఒకేసారి జనరేట్ కావడం లేదని విద్యాశాఖ కార్యదర్శి దృష్టికి తెచ్చారు. నెలవారీ సంగ్రహ నివేదిక ఆధారంగా బిల్లులు వాటికవే జనరేట్ అయ్యేలా యాప్‌ను మెరుగుపరచాలని సూచించారు. డీఈవో వెంకటేశ్వరచారి, కొత్తగూడెం ఎంఈవో ప్రభుదయాళ్, ఎఫ్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కచ్చితమైన లక్ష్యాలతో ముందుకెళ్లాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో బి.రాహుల్

దుమ్ముగూడెం, మార్చి 3: బాల బాలికలు పదో తరగతి వరకు పూర్తి చేసిన అనంతరం ఖచ్చితమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఉన్నతవిద్యను అభ్యసిస్తే జీవితంలో అనుకున్నది సాధించవచ్చని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రునిపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఏ రంగంలో స్థిరపడాలి అనుకుంటున్నారో.. ఇప్పటి నుంచే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించే ఉద్దేశంతో విద్య, ఉద్యోగ సమాచారం కోసం ఈ ప్లెక్సీలు ఏర్పాటు చేశామని తెలిపారు. బాలబాలికల్లో దాగి ఉన్న అంతర్గత ప్రతిభను వెలికి తీసేందుకు, విద్యా ప్రమాణాలు మరింత పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి పాఠశాలలో పెట్టిన చార్టులను గమనించి వాటిలో సారాంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏవో సున్నం బాబురావు, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో అశోక్‌కుమార్, ఎంఈవో సమ్మయ్య, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, హెచ్ఎంలు నరసింహారావు, బట్టు రాములు, సోమశేఖర్, నరేందర్, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

మిర్చి రైతాంగానికి మద్దతు ధర కల్పించాలి

బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి, మానె రామకృష్ణ

భద్రాచలం, మార్చి 3: మిర్చి క్వింటాకు రూ.30 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి, మానె రామకృష్ణ తెలిపారు. భద్రాచలంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. క్వింటా మిర్చికి మద్దతు ధర కనీసం రూ.30 వేలు ఇవ్వాలని, రైతాంగాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య

భద్రాచలం, మార్చి 3: రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఉద్యోగులకు ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. భద్రాచలంలో సోమవారం పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయంలో ఆయనను రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల యూనియన్(ఐఎన్‌టీయుసీ అనుబంధం) నాయకులు కలిసి పలు సమస్యలను ఆయనకు వివరించారు. స్పందించిన ఆయన వెంటనే విద్యుత్ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఇనుగాల శ్రీధర్‌కు ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

భూ వివాదంలో కత్తులతో దాడి

ఐదుగురికి తీవ్ర గాయాలు

దమ్మపేట, మార్చి 3 : భూ వివాదంలో అన్నదమ్ములు కత్తులతో దాడి చేసుకోవడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం చిన్నగొల్లగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నగొల్లగూడెం గ్రామానికి చెందిన కౌలూరి ముత్తారావు, దుర్గయ్య, వెంకన్న, సంజీవరావు, పుల్లారావు అనే అన్నదమ్ములకు గ్రామంలో సుమారు ఆరు ఎకరాల భూమి ఉంది. అయితే భూ పంపకాల నేపథ్యంలో చెలరేగిన గొడవ తీవ్ర ఘర్షణకు దారితీసింది. దీంతో అన్నదమ్ములు కత్తులతో దాడి చేసుకోవడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అక్కడే ఉన్న మరికొందరు తీవ్ర గాయాలపాలైన వారిని అంబులెన్స్‌లో దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల వివరాలు సేకరిస్తున్నారు.

గిరిజన గురుకులంలో వైద్య శిబిరం

పాల్వంచ, మార్చి 3: స్థానిక నెహ్రూ నగర్‌లోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో విద్యార్థినుల కోసం వైద్య శిబిరాన్ని గుడిపాడు యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది సోమవారం నిర్వహించారు. రక్తహీనతతో బాధపడుతున్న వారి నుంచి రక్త పూతలు సేకరించారు.

తహసీల్దార్‌కు వినతి

ములకలపల్లి, మార్చి 3: ఏజెన్సీ ప్రాంతంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు సోమవారం తహసీల్దార్ పుల్లయ్యకు వినతి పత్రం ఇచ్చారు. మండలంలోని రాజుపేట కాలనీ శివారు వాగు సమీపంలో ఇలా అక్రమంగా ఇటుక బట్టీలు నడుస్తున్నాయని తెలిపారు. నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, కీసరి వీరభద్రం, మడకం రమేష్, కోంద్రు రాజులు, రాము తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేట, మార్చి 3: మతోన్మాద శక్తులు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. పార్టీ స్థానిక కార్యాలయంలో సోమవారం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి మతోన్మాదం, కార్పొరేటీకరణ ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మతాలకతీతంగా ఉన్మాదాన్ని ఎండగట్టడమే పార్టీ తక్షణ కర్తవ్యమని స్పష్టం చేశారు. నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, పిట్టల అర్జున్, బి.చిరంజీవి నాయుడు, సోడెం ప్